సాక్షి తిరుపతి

గురువారం । 29 । ఫిబ్రవరి । 2024



సీఎం చొరవతోనే అభివృద్ధి

ముఖ్యమంత్రి చొరవతోనే పుంగనూరు నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టినట్లు మంత్రి పెద్దిరెడ్డి తెలిపారు. - 8లో



భవిష్యత్‌లో సైన్స్ కేంద్రంగా..

భవిష్యత్‌లో సైన్స్ అభివృద్ధి కేంద్రంగా తిరుపతి ఐఐటీ మారబోతోందని జేఎన్‌యూ వీసీ రూపమంజరి ఘోష్ తెలిపారు. - 8లో




చరిత్రలో నిలిచేలా అభివృద్ధి

చరిత్రలో నిలిచేలా చంద్రగిరి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసినట్లు తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి తెలిపారు. - 8లో

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ ఒంగోలు పార్లమెంటు సమన్వయకర్తగా చెవిరెడ్డి భాస్కరరెడ్డి



తిరుపతి రూరల్: వైఎస్సార్‌సీపీ ఒంగోలు పార్లమెంటు సమన్వయకర్తగా చెవిరెడ్డి భాస్కరరెడ్డిని నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీచేసింది. ఈయన ప్రస్తుతం ప్రభుత్వ విప్‌గాను, చంద్రగిరి శాసనసభ్యునిగా, వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల రాష్ట్ర కోఆర్డినేటర్‌గా ఉన్నారు. పార్టీలో పలు కీలక బాధ్యతలను చెవిరెడ్డి సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. గతంలో తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు. చంద్రబాబు సొంత నియోజకవర్గం అయిన చంద్రగిరి నుంచి 2014, 2019లో శాసనసభ్యునిగా ఘన విజయం సాధించారు. ఇటీవల వైఎస్సార్ సీపీ ఒంగోలు, నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గాల కోఆర్డినేటర్‌గా చెవిరెడ్డిని పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నియమించారు. తాజాగా చెవిరెడ్డి భాస్కరరెడ్డిని వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంటు సమన్వయకర్తగా ప్రకటించడంతో పార్టీలో నూతనోత్సాహం నెలకొంది.

వైఎస్సార్‌సీపీ జీడీ నెల్లూరు ఇన్‌చార్జిగా కృపాలక్ష్మి



కళత్తూరు కృపాలక్ష్మి

సాక్షి, చిత్తూరు: వైఎస్సార్‌సీపీ గంగాధర నెల్లూరు ఇన్‌చార్జిగా కళత్తూరు కృపాలక్ష్మి నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటించింది. ప్రస్తుతం జీడీ నెల్లూరు నియోజకవర్గానికి ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈయన పెద్ద కుమార్తె కృపాలక్ష్మి తండ్రి రాజకీయాలకు చేదోడువాదోడుగా నిలిచారు. ఫిజియో థెరపీలో డిగ్రీ పొందిన ఈమె ప్రస్తుతం న్యాయవిద్యను అభ్యసిస్తున్నారు. తాజాగా నారాయణస్వామి విన్నపం మేరకు కృపాలక్ష్మిని వైఎస్సార్‌సీపీ జీడీనెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించారు.

శాస్త్రోక్తంగా సంకటహర చతుర్ధశి



హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

శ్రీకాళహస్తి: ముక్కంటి ఆలయంలోని అంజి అంజి వినాయకస్వామి గుడి వద్ద బుధవారం శాస్త్రోక్తంగా సంకటహర చతుర్ధశి పూజలు నిర్వహించారు. అనంతరం వేదపండితులు గణపతి హోమం చేశారు. ఈ సందర్భంగా స్వామివారిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బోయకొండలో లక్ష కుంకుమార్చన

చౌడేపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న బోయకొండ గంగమ్మ ఆలయంలో ప్రతి ఏటా మాఘమాసంలో వైభవంగా నిర్వహించే లక్ష కుంకుమార్చన కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. ఆలయంలో గత 15 యేళ్లుగా హిందూ సంప్రదాయ రీతిలో లక్ష కుంకుమార్చన నిర్వహిస్తున్నారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య అమ్మవారి ఉత్సవ మూర్తికి ప్రత్యేక పూజలు చేసి లక్ష కుంకుమార్చన కార్యక్రమాన్ని ప్రారంభించారు.


సార్వత్రిక సమరం.. ఫ్యాన్ సిద్ధం

సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వైఎస్సార్‌సీపీ సమరోత్సాహంతో ముందుకు సాగుతోంది.. యావత్ పార్టీ యంత్రాంగం ఫుల్ జోష్‌తో ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తోంది.. క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలతో చేకూరిన లబ్ధిని వివరిస్తోంది.. సిద్ధం సభల ద్వారా ప్రజల నాడి తేటతెల్లం కావడంతో రెట్టించిన ఉత్తేజంతో దూసుకెళుతోంది.. ఉమ్మడి జిల్లాలోని అన్ని నియోజకవర్గాలను క్లీన్ స్వీప్ చేయడమే లక్ష్యంగా జనంతో మమేకమవుతోంది.. అత్యధిక మెజారిటీలు సాధించి విజయదుందుభి మోగించేందుకు సన్నద్ధమవుతోంది.. ఇదే సమయంలో పచ్చసేన మాత్రం పొత్తుల చిక్కులతో చిత్తవుతోంది.. అసంతృప్తులను బుజ్జగించేందుకు నానా అవస్థలు పడుతోంది.. గోడదూకేందుకు సమాయత్తమవుతున్న నేతలను ప్రసన్నం చేసుకునేందుకు మల్లగుల్లాలు పడుతోంది.

- జోరుగా వైఎస్సార్‌సీపీ నేతల ప్రచారం
- క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరిస్తున్న సంక్షేమ సైన్యం
- పొత్తులతో చిత్తవుతున్న టీడీపీ, జనసేన
- ఆందోళనలో పచ్చసేన శ్రేణులు
- గోడ దూకేందుకు సన్నద్ధమవుతున్న టికెట్ ఆశించి భంగపడిన నేతలు
- అసంతృప్తుల చుట్టూ తిరుగుతున్న టీడీపీ అభ్యర్థులు



శాంతిపురం మండలంలో నిర్వహించిన ముఖ్యమంత్రి సభలో కార్యకర్తల ఉత్సాహం(ఫైల్)



సాక్షి, తిరుపతి : ఎన్నికలు సమీపిస్తుండడంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అధికార వైఎస్సార్ కాంగ్రెస్‌లో ఫుల్ జోష్ కనిపిస్తోంది. ఓ వైపు అభివృద్ధి.. మరో వైపు సంక్షేమ పథకాలతో సుపరిపాలన అందించి శభాష్ అనిపించుకుంటున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి అధికారంలోకి తీసుకువచ్చేందుకు పార్టీ నేతలు, కార్యకర్తలు రంగంలోకి దిగారు. వచ్చే ఎన్నికల్లో అన్ని నియోజకవర్గాలను గెలుచుకుంటామని ధీమా వ్యక్తం చేస్తున్నారు. కుప్పం నుంచి గూడూరు వరకు 'ఫ్యాన్'కు తిరుగులేదని నిరూపించేందుకు 'సిద్ధం' అంటున్నారు. ఉమ్మడి జిల్లాలో పార్టీ ఏ కార్యక్రమం నిర్వహించినా అనూహ్య స్పందన లభించడమే ఇందుకు నిదర్శనమని స్పష్టం చేస్తున్నారు. అందులో భాగంగానే అనంతపురం జిల్లా రాప్తాడులో జరిగిన 'సిద్ధం' సభకు చిత్తూరు, తిరుపతి జిల్లాల నుంచి పెద్దసంఖ్యలో ప్రజలు తరలివచ్చారని వెల్లడిస్తున్నారు. కరోనా కష్ట కాలంలో దిక్కులేని ఎంతో మందికి ప్రభుత్వం, వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులుఅండగా నిలవడాన్ని జనం గుర్తుచేసుకుంటున్నారని వివరిస్తున్నారు. ఇదే క్రమంలో ప్రజలు సైతం ఆపత్కాలంలో ఆదుకున్న వారికే తమ మద్దతు అని స్పష్టం చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ నేతలకు అపూర్వ ఆదరణ

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఓ వైపు.. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు మరో వైపు ఇంటింటికి వెళ్లి స్థానిక సమస్యలు తెలుసుకోవటంతో పాటు.. సంక్షేమ పథకాలు అందుతున్నాయా? లేదా? అని విచారిస్తున్నారు. ఇంటింటికీ వెళుతున్న మంత్రులు, ప్రజాప్రతినిధులకు ఆయా ప్రాంతాల్లో ప్రజలు ఘనంగా స్వాగతం పలుకుతున్నారు. మంత్రులు నారాయణస్వామి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్‌కే రోజా, ఎంపీలు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, గురుమూర్తి, రెడ్డెప్ప, ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుమారుడు తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, మరో వైపు చెవిరెడ్డి లక్ష్మి, చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి ఆయా నియోజక వర్గాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. తిరుపతిలో టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ఓ వైపు, నియోజక వర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి మరో వైపు పర్యటిస్తున్నారు. వెంకటగిరిలో పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, శ్రీకాళహస్తిలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఆయన సతీమణి బియ్యపు శ్రీవాణిరెడ్డి, కుమార్తె పవిత్రారెడ్డి, సూళ్లూరుపేటలో కిలివేటి సంజీవయ్య, గూడూరులో మేరిగ మురళీధర్, చిత్తూరులో విజయానందరెడ్డి, కుప్పంలో ఎమ్మెల్సీ భరత్, పలమనేరులో వెంకటేగౌడ, పూతలపట్టులో డాక్టర్ సునీల్‌కుమార్, సత్యవేడులో రాజేష్ సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. వీరికి తోడుగా మేము సైతం అంటూ వైఎస్సార్‌సీపీ శ్రేణులు వెంట నడుస్తూ.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రి చేయాలని కోరుతున్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా.. సచివాలయాలు, రైతు భరోసా, హెల్త్ క్లినిక్‌లు ఇదే స్థాయిలో సేవలందించాలన్నా.. వలంటీర్ వ్యవస్థ ఉండాలన్నా.. పుష్కలంగా వర్షాలు కురిసి ఉమ్మడి జిల్లా పంటలతో కలకళలాడాలన్నా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిస్తున్నారు.

కుప్పంలో వైఎస్ జగన్‌కు నీరా'జనం'

పద్నాలుగేళ్ల ముఖ్యమంత్రిగా.. ఏడు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిపించిన కుప్పం ప్రజలకు చంద్రబాబు కనీసం తాగు నీరు కూడా ఇవ్వలేకపోయారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేవలం 57 నెలల కాలంలోనే హంద్రీ–నీవా ద్వారా కృష్ణా జలాలను తీసుకొచ్చి కుప్పం ప్రజల చేత శభాష్ అనిపించుకున్నారు. కృష్ణా జలాలు విడుదల సందర్భంగా మూడు రోజుల క్రితం కుప్పంలో పర్యటించిన సీఎం వైఎస్ జగన్‌కు నియోజక వర్గ ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు.సీఎం రాకతో గుండిశెట్టిపల్లె రాజుపేట వద్ద స్థానికులు అడుగడుగునా నీరాజనం పట్టారు. కరువు కాటకాలతో అల్లాడుతున్న పడమటి ప్రాంతానికి నీళ్లు తీసుకొచ్చిన దేవుడని సీఎం వైఎస్ జగన్‌ని కీర్తిస్తున్నారు. ఈ పరిణామాలను జీర్ణించుకోలేని టీడీపీ అండ్ కో దుష్ప్రచారానికి తెరతీయించింది. కరువు సమయంలో కూడా కృష్ణా నీటిని తీసుకొచ్చినందుకు ఆనందించకుండా బురద జల్లటమే ధ్యేయంగా టీడీపీ అండ్ కో పనిచేస్తుండడంపై స్థానికులు మండిపడుతున్నారు. కాలువలో నీరు ప్రవహిస్తున్నా టీడీపీ అండ్ కో ఇంత నీచానికి దిగుతారా? అంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సమర్థవంతంగా ఎన్నికల విధులు



పోలీసు అధికారులతో సమీక్షిస్తున్న ఎస్పీ మలికా గార్గ్

నారాయణవనం : రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని ఎస్పీ మలికా గార్గ్ స్పష్టం చేశారు. బుధవారం మండలంలోని సురుటుపల్లె వద్ద అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును ఆమె తనిఖీ చేశారు. అనంతరం సర్కిల్ కార్యాలయంలో పుత్తూరు సబ్‌డివిజన్ స్థాయి పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. పోలీస్‌శాఖలో క్రమశిక్షణ, నిజాయితీ మాత్రమే వారి గుర్తింపునకు ప్రాతిపదికగా నిలుస్తాయన్నారు. ఎన్నికల నేపథ్యంలో చెక్ పోస్టుల వద్ద పకడ్బందీగా తనిఖీలు నిర్వహించాలని సూచించారు. అక్రమంగా ఇసుక, గ్రావెల్ రవాణా చేసే వారిపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. ఎన్నికల్లో గొడవలు తలెత్తకుండా రౌడీ షీటర్లు, కిరాయి గుండాలు, పాత నేరస్తులు కదలికలపై కట్టుదిట్టంగా నిఘా పెట్టాలని, సకాలంలో బైండోవర్ చేయాలని స్పష్టం చేశారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిపించేందుకు కృషి చేయాలని కోరారు. రోడ్డుప్రమాదాల నివారణకు పకడ్బందీ కార్యాచరణ అమలు చేయాలని తెలిపారు. ఫిర్యాదీలతో మర్యాదపూర్వంకగా నడుచుకోవాలని సూచించారు. చిన్నపిల్లలు, మహిళలకు సంబంధించిన ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని స్పష్టం చేశారు. జలపాతాల వద్ద అటవీ శాఖతో సమన్వయం చేసుకుంటూ అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలని చెప్పారు. చెక్‌పోస్టుల్లో ఏమాత్రం అలసత్వం వహించకుండా ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీఎస్పీ శ్రీనివాసరావు, ట్రైనీ డీఎస్పీ సింధుప్రియ, సీఐలు ఓబులేసు, భాస్కర్ నాయక్, దివాకర్ రెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమమే లక్ష్యంగా సుపరిపాలన





రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ చేస్తున్న సమన్వయకర్త రామ్‌కుమార్‌రెడ్డి, ఎంపీలు మస్తాన్‌రావు, గురుమూర్తి, సభకు హాజరైన మహిళలు

సైదాపురం : ఆడపడుచుల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని, దేశ చరిత్రలోనే కనీవినీ ఎరుగని పథకాలను అమలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, ఎంపీలు బీద మస్తాన్‌రావు, గురుమూర్తి తెలిపారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో నవరత్నాలు– పేదలందరికీ ఇళ్ల పథకం కింద మంజూరైన ఇంటి స్థలాలకు సంబంధించి రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేశారు. ఈ మేరకు సైదాపురం, కలువాయి, రాపూరు మండలాలకు చెందిన 2,275 మంది లబ్ధిదారులకు ఇంటి స్థలాలపై శాశ్వత హక్కులు కల్పించారు. రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ నిరుపేదలకు పైసా ఖర్చులేకుండా ఇంటి స్థలంపై సర్వహక్కులు కల్పించేందుకు ప్రభుత్వమే ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయించి పట్టాలు అందిస్తోందన్నారు. ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి నియోజకవర్గంలో అభివృద్ధి పనులను పరుగులు తీయిస్తున్నట్లు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించి గెలిపిస్తే మరింతంగా సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు చేస్తామని వెల్లడించారు. ఎంపీ బీద మస్తాన్‌రావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో బీసీలకు అధిక ప్రాధాన్యత దక్కుతోందన్నారు. ఎల్లోమీడియా సహకారంతో ప్రతిపక్షాలు ఎన్ని కుతంత్రాలు పన్నినా అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముందుకు వెళుతున్నారని కొనియాడారు. చంద్రబాబు మాయమాటలకు ఎవరూ మోసపోవద్దని, సాధ్యం కాని హామీలతో మళ్లీ బురిడీ కొట్టించాలని ప్రయత్నిస్తున్నారని హెచ్చరించారు. ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గంలో సుమారు రూ.100 కోట్లు నిధులతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు వెల్లడించారు. పేదల అభ్యున్నతి కోసం అహర్నిశలు శ్రమించే జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సైదాపురం, కలువాయి, రాపూరు మండలాల కన్వీనర్లు రవికుమార్, కృష్ణారెడ్డి, దయాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు అనిల్‌కుమార్‌రెడ్డి సొసైటీ అధ్యక్షుడు గోగినేని శివకుమార్, జేసీఎస్ కన్వీనర్లు గుంటమడుగు శ్రీనివాసులురాజు, నారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ తిరకాల భాస్కర్, మాజీ సర్పంచ్ బండి వెంకటేశ్వర్లురెడ్డి, పార్టీ మండల ఉపాధ్యక్షుడు రాజశేఖర్‌నాయుడు, సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి, నేతలు మాలకొండారెడ్డి, రామ్‌గోపాల్‌రెడ్డి రాఘవరెడ్డి, సుబ్బారెడ్డి, దయాకర్‌రెడ్డి, మనోహర్, ప్రసాద్‌రాజు, విజయభాస్కర్, వీరాస్వామి, బీఎస్ యాదవ్, రాధారెడ్డి, సర్పంచ్ శారద ఎంపీటీసీ సభ్యులు పద్మ, సొసైటీ మాజీ అధ్యక్షుడు మోహన్‌రావు పాల్గొన్నారు.

వ్యవసాయానికి 'భరోసా'

- 1,80,763 మంది రైతుల ఖాతాల్లో రూ.36.29 కోట్లు జమ
- కలెక్టరేట్‌లో వైఎస్సార్ రైతు భరోసా జిల్లాస్థాయి కార్యక్రమం



లబ్ధిదారులకు మెగా చెక్కు అందిస్తున్న జేసీ శుభం బన్సల్, డీఏఓ ప్రసాద్‌రావు

తిరుపతి అర్బన్: వ్యవసాయానికి ప్రభుత్వం అన్నివిధాలా అండగా నిలుస్తోందని జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ తెలిపారు. ఈ క్రమంలోనే రైతు భరోసా– పీఎం కిసాన్ యోజన కింద పెట్టుబడి సాయం అందజేస్తోందని వెల్లడించారు. బుధవారం బుధవారం తాడేపల్లి క్యాంప్ కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు భరోసా మూడోవిడత నగదును విడుదల చేశారు. కలెక్టరేట్ నుంచి జేసీతో ఇతర అధికారులు, రైతులు పాల్గొన్నారు. జేసీ మాట్లాడుతూ మూడోవిడతలో జిల్లావ్యాప్తంగా మొత్తం 1,80,763 మంది రైతుల ఖాతాలకు రూ. 36.29 కోట్లు జమ చేసినట్లు తెలిపారు. వైఎస్సార్ సున్నా వడ్డీ ద్వారా రూ. 3.93 కోట్లు అందించినట్లు వివరించారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎస్.ప్రసాద్‌రావు మాట్లాడుతూ రైతులు పంటల సాగుకు అప్పులు చేయాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వమే పెట్టుబడి సాయం అందిస్తోందని తెలిపారు. అన్నదాత సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మకమైన పథకాలు అమలు చేస్తున్నారని వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి దశరథరామి రెడ్డి, సెరికల్చర్ అధికారి గీతారాణి, ఏడీఏ మనోహర్, ఏఓలు గాయత్రి, హరిత, సరళ పాల్గొన్నారు.

ఇది రైతు ప్రభుత్వం



"రాష్ట్రంలో రైతు ప్రభుత్వం కొనసాగుతోంది, ఈ స్థాయిలో మాకు మేలు చేసిన నాయకులు లేరు. పెట్టుబడికి రైతు భరోసా ఇస్తున్నారు. ఆర్‌బీకేల ద్వారా నాణ్యమైన ఎరువులు, విత్తనాలు రాయితీపై అందిస్తున్నారు. పంట నష్టపోతే బీమాతో ఆదుకుంటున్నారు. పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తున్నారు. ఈ ప్రభుత్వం కలకాలం ఉండాలి.

– జగన్మోహన్, రైతు, చంద్రగిరి మండలం

సకాలంలో సాయం



గతంలో చంద్రబాబునాయుడు వ్యవసాయం దండగని అన్నారు. ఇప్పుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అదే వ్యవసాయాన్ని పండుగలా మార్చారు. రైతు భరోసా కేంద్రాలను తీసుకొచ్చి రైతులకు అండగా నిలుస్తున్నారు. సకాలంలో సాయం అందిస్తున్నారు. దీంతో సేద్యం సులభంగా మారింది.

– నాగిరెడ్డి, రైతు, రేణిగుంట మండలం

విద్యార్థులు విజ్ఞాన శాస్త్రంపై పట్టు సాధించాలి



ఉత్తమ ప్రాజెక్టులకు బహుమతులు అందజేస్తున్న టీటీడీ డీఈవో ఎం.భాస్కర్‌రెడ్డి

తిరుపతి(అలిపిరి): విద్యార్థులు బాల్యం నుంచే విజ్ఞాన శాస్త్రంపై పట్టు సాధించాలని టీటీడీ డీఈవో భాస్కర్‌రెడ్డి సూచించారు. వెంకటేశ్వర ఉన్నత పాఠశాలలో బుధవారం జాతీయ సైన్సు దినోత్సవాన్ని ప్రధానోపాధ్యాయులు సంధ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన హాజరై పిల్లలు తయారు చేసిన సైన్సు ప్రాజెక్టులను పరిశీలించారు. అనంతరం ఉత్తమ ప్రదర్శనలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో తిరుపతి అర్బన్ ఎంఈవో బాలాజీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైలు కిందపడి వ్యక్తి మృతి

ఏర్పేడు : మండలంలోని బాలకృష్ణాపురం రైల్వే గేటు సమీపంలో బుధవారం గుర్తు తెలియని వ్యక్తి (34) రైలు కిందపడి మృతిచెందాడు. స్థానికులు అందించిన సమాచారం మేరకు రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృత దేహానికి పంచనామా చేసి పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి ఒంటిపై బ్లూ కలర్ టీషర్ట్, జీన్స్ ప్యాంట్ ఉన్నట్లు వెల్లడించారు. రైలులో ప్రయాణిస్తూ కాలు జారి కిందపడి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు.

1 నుంచి 'జగనన్న పాల వెల్లువ'



పాల శీతలీకరణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జేసీ

భాకరాపేట: జగనన్న పాల వెల్లువ కార్యక్రమాన్ని మార్చి 1వ తేదీ నుంచి ప్రారంభించాలని జాయింట్ కలెక్టర్ శుభం భన్సల్ ఆదేశించారు. బుధవారం చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం మండలాల్లోని జగనన్న పాల వెల్లువ కేంద్రాలు, పాల శీతలీకరణ కేంద్రాలను పరిశీలించారు. 24 గంటల్లో పాల కేంద్రాల్లో అవసరమైన యంత్రాలు అమర్చాలని స్పష్టం చేశారు. పాల ధరను పాడి రైతుకు అర్థమయ్యేలా తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో డీసీఓ శ్రీనివాసులరెడ్డి, జేడీ రవికుమార్, ఎంపీడీఓ దేవేంద్రబాబు పాల్గొన్నారు.

అలవోకగా ఆంగ్లం

- 'బెండపూడి'ని తలపిస్తున్న పలమనేరు గర్ల్స్ స్కూల్
- ఇంగ్లిషులో అనర్గళంగా మాట్లాడుతున్న విద్యార్థినులు
- నాడు–నేడుతో సౌకర్యాల్లోనూ ఉన్నతంగా పాఠశాల

పలమనేరు : రాష్ట్రంలోని బెండపూడి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆంగ్లంలో అనర్గళంగా మాట్లాడుతూ దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించడం మనందరం చూశాం. అదే బాటలో ఇప్పుడు చిత్తూరు జిల్లాలోని పలమనేరు బాలికోన్నత పాఠశాల చేరింది. ఇక్కడి విద్యార్థినులు అవలీలగా ఆంగ్లంలో మాట్లాడేస్తున్నారు. జిల్లాలోనే వెనుకబడిన నియోజకవర్గమైన పలమనేరులోని సర్కారు బడి పిల్లలే ఇంగ్లిషులో ఇలా పట్టు సాధించారంటే.. ఇక రాష్ట్రంలోని మిగతా బడుల్లోని పిల్లలు భవిష్యత్తులో ఎన్ని అద్భుతాలు సృష్టిస్తారో అంచనా వేయొచ్చు.

ఒకప్పుడు సమస్యల వలయం

పట్టణంలోనే పురాతన బడిగా ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలకు పేరుంది. ఇక్కడ ఏటా 1,000 మంది దాకా బాలికలు విద్యనభ్యసిస్తుంటారు. ఈ పాఠశాలలో గతంలో తాగునీటికి కూడా విద్యార్థినులు ఇబ్బంది పడేవారు. అసలే బాలికలు చదివే బడి.. అయినా మూత్రశాలలు చాలినన్ని లేక వారి కష్టాలు వర్ణనాతీతం. కూలేందుకు సిద్ధంగా ఉన్న గదులు, పగుళ్లు తీసిన ప్రహరీగోడలు.. ఇలా చెప్పుకొంటూ పోతే అన్నీ సమస్యలే.



పలమనేరులోని బాలికోన్నతపాఠశాల

'నాడు–నేడు'తో సకల సౌకర్యాల నిలయం

నాడు–నేడు ఫేజ్–1 ద్వారా ఈ పాఠశాలకు రూ.60 లక్షలు మంజూరైంది. ఫేజ్–2 ద్వారా రూ.3 కోట్లు మంజూరైంది. ఈ నిధులతో బడిని సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. శిథిలావస్థలోని తరగతి గదుల స్థానంలో కొత్త గదులు, పిల్లలకు అవసరమైనన్ని టాయ్‌లెట్లు, మరుగుదొడ్లు, తాగునీటి కోసం ఆర్వో ప్లాంట్, బడిలో కొత్త ఫర్నిచర్, పిల్లలకు డెస్కులు, గ్రానైట్, పార్కింగ్ టైల్స్ ఇలా మేజర్, మైనర్ మరమ్మతులు అన్నీ పూర్తి చేశారు. తరగతి గదుల్లో ఫ్యాన్లు, కలర్ డెస్కులు, లైట్లు, చక్కటి వాల్‌పెయింటింగ్స్, గ్రీన్ చాక్‌బోర్డులు ఇలా కార్పొరేట్ సౌకర్యాలు సమకూరాయి. గతంలో నుంచి టాప్ మార్కులు సాధించే ఈ బాలికోన్నత పాఠశాల.. ఇప్పుడు టాప్ సౌకర్యాల పాఠశాలగా కార్పొరేట్ బడిని తలదన్నేలా తయారైంది. ఇప్పుడీ బడిలో 986 మంది చదువుతున్నారు. వీరికి అన్ని రకాల సౌకర్యాలు, నాణ్యమైన భోజనం, ఉచితంగా పుస్తకాలు, యూనిఫామ్ తదితరాలు అందాయి. అన్ని తరగతుల్లోనూ డిజిటల్ బోర్డులు(ఐఎఫ్‌పీ), బైజూస్ ద్వారా పిల్లలతో పాటు టీచర్లకు 450 దాకా ట్యాబ్‌లిచ్చారు. టీచర్లు తరగతి గదిలో కేవలం ఇంగ్లిషులోనే పిల్లలతో మాట్లాడడం, వారితోనూ మాట్లాడించడం వల్ల వారు పట్టుసాధించారు. దీంతో పాటు విద్యా బోధన సైతం ఆంగ్లమాధ్యమం ఉండడంతో వీరికి అలవోకగా ఇంగ్లిషు మాట్లాడడం నేర్చుకున్నారు.







నాడు-నేడు కింద ఏర్పాటు చేసిన కొత్త మరుగుదొడ్లు, ఆర్‌ఓ ప్లాంట్ ద్వారా తాగునీరు, విద్యార్థులు హ్యాండ్ వాష్ చేసుకునేందుకు కొళాయిలు

మా పేరెంట్స్ గర్వపడుతున్నారు..



నేను ప్రైవేటు స్కూల్‌లో చదివి.. ఎనిమిదో తరగతిలో ఇక్కడ చేరా. అక్కడి సౌకర్యాలు సర్కారు లేవే అనుకునేదాన్ని. కానీ ఇప్పుడు చూస్తే కార్పొరేట్ స్కూల్ కంటే మిన్నగా ఉంది. మేం ఇంగ్లిషు సైతం చక్కగా మాట్లాడుతున్నాం. నన్ను చూసి మా పేరెంట్స్ గర్వంగా ఫీలవుతున్నారు.

– యమున, 8వ తరగతి

అడ్మిషన్లు పెరిగాయి



ఇంగ్లిషు మీడియం ప్రవేశపెట్టడంతో మా బడిలో అడ్మిషన్లు బాగా పెరిగాయి. పిల్లలు ఆంగ్లంలో అనర్గళంగా మాట్లాడుతున్నారు.

– లత, ప్రధానోపాధ్యాయిని

అనర్గళంగా మాట్లాడటం అబ్బింది



గతంలో తాగేందుకు మంచినీళ్లు కూడా ఉండేవి కావు. ఇప్పుడు హాయిగా ఆర్వో ప్లాంట్‌లో మినరల్ వాటర్ తాగుతున్నాం. గతంలో వానొస్తే బడి మొత్తం చెరువులా మారేది. ఇప్పుడు ఆ సమస్య లేదు. ఓ కార్పొరేట్ స్కూల్ కంటే మా బడి పదిరెట్లు బాగుంది. టీచర్ల కృషితో మాకు ఇంగ్లీషు బాగా మాట్లాడడం అబ్బింది.

– అమూల్య, 10వ తరగతి

జగన్ మామకు థ్యాంక్స్



మేం మా క్లాస్‌మేట్స్‌తో ఇంగ్లిషులోనే మాట్లాడతాం. మా యూనిఫామ్, షూ, అనర్గళంగా మేం మాట్లాడుతున్న ఇంగ్లిషును చూస్తే మాకే చాలా గర్వంగా ఉంది. మా తల్లిదండ్రులు సైతం చాలా సంతోషంగా ఉన్నారు. జగన్ మామకు థ్యాంక్స్.

– ప్రవల్లిక, 9వ తరగతి

సబ్జెక్టులపై పట్టు పెరిగింది..



ఆంగ్లం రావడం వల్ల మాకు సబ్జెక్ట్‌లపై పట్టు పెరిగింది. జనరల్‌గా సబ్జెక్ట్‌ను ఇంగ్లిషులో రాయడం కూడా వచ్చింది. ఏదేమైనా మా బడిలో మా ఫ్రెండ్స్ అంతా ఇంగ్లిషులో మాట్లాడుతూ ఉంటే చాలా సంతోషంగా ఉంటుంది.

– భావన, 9వ తరగతి

సీఎం ప్రత్యేక చొరవతోనే అభివృద్ధి



షాదీమహల్ ప్రారంభోత్సవంలో మంత్రి పెద్దిరెడ్డి

సదుం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో పుంగనూరు నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. సదుం, సోమల మండలాల్లో రూ.30 కోట్ల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ఎంపీ రెడ్డెప్పతో కలసి మంత్రి బుధవారం ప్రారంభించారు. పూర్తయిన అభివృద్ధి పనులను చూసి ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నట్టు చెప్పారు. వైఎస్సార్‌సీపీ పాలనలో నియోజకవర్గంలో ఎప్పుడూ లేనంత అభివృద్ధి చేసి చూపించామన్నారు. సీఎం చొరవతో చేస్తున్న సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధిని ప్రజలు గుర్తించారని పేర్కొన్నారు. మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించేందుకు రానున్న ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు.

హంద్రీ–నీవాపై విష ప్రచారం

హంద్రీ–నీవా కాలువ పనులు పూర్తి కాలేదని పచ్చ మీడియా పదే, పదే విష ప్రచారం చేస్తోందని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులు పూర్తవడంతో నియోజకవర్గంలో ఒక చెరువు కూడా నిండిందని ఆయన తెలిపారు. కాలువలో ధర్నాలు అంటూ ఓవర్ యాక్షన్ చేస్తున్నారని మండిపడ్డారు. సాంకేతిక బృందాన్ని తీసుకువచ్చి కాలువ పనులు పూర్తయ్యాయో లేదో పరిశీలించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, ట్రాన్స్‌కో ఎస్‌ఈ కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప, పార్టీ మండల కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జి ప్రకాష్‌రెడ్డి, బోయకొండ ఆలయ కమిటీ సభ్యుడు భాస్కర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ తిమ్మారెడ్డి, ఎంపీడీఓ రాజశేఖర్‌బాబు, ఈఓపీఆర్‌డీ వరప్రసాద్ పాల్గొన్నారు.

• వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ శ్రేణులు



పార్టీలో చేరిన వారితో బియ్యపు పవిత్రారెడ్డి

ఏర్పేడు : డలంలోని మోదుగులపాళెం గ్రామానికి చెందిన 20 మంది టీడీపీ నేతలు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. బుధవారం శ్రీకాళహస్తిలో పార్టీ కార్యాలయంలో చంద్రశేఖర్ ఆచారి, తొండంనాటి మురళి, ఎస్.చంద్రమ్మ తదితరులకు వైఎస్సార్‌సీపీ రేణిగుంట మండల ఇన్‌చార్జి బియ్యపు పవిత్రారెడ్డి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జి గున్నేరి కిషోర్ రెడ్డి, నాయకులు గాలి గుణశేఖర్ నాయుడు, వెంకటేష్ యాదవ్, శేఖర్ రెడ్డి, రమేష్, రవి యాదవ్, మునిశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

సముద్రస్నానానికి వెళ్లి విద్యార్థి మృతి

నారాయణవనం: స్థానిక ప్రైవేట్ కళాశాలలో డిప్లొమా చదువుతున్న ధనుష్(20) అనే విద్యార్థి పాండిచ్చేరి వద్ద సముద్రస్నానానికి వెళ్లి మృతి చెందాడు. వివరాలు.. స్నేహితులతో కలిసి ధనుష్ పాండిచ్చేరికి టూర్ వెళ్లాడు. బుధవారం ఉదయం సమీపంలోని సముద్రంలోకి దిగాడు. అలల తీవ్రతకు గల్లంతయ్యాడు. మధ్యాహ్నం సముద్రం ఒడ్డుకు మృతదేహం కొట్టుకు వచ్చింది.

కత్తిపోట్లకు ఒకరి బలి

సైదాపురం : మండలంలోని గులించెర్ల దళితవాడలో మంగళవారం కత్తిపోట్లకు గురైన వ్యక్తి చికిత్సపొందుతూ బుధవారం మృతి చెందాడు. వివరాలు.. స్థానికంగా నివసించే కుంచం ప్రకాష్(40) కుటుంబంలో చిన్నపాటి వివాదం తలెత్తడంతో చాట్ల రమేష్ అనే వ్యక్తి మధ్యస్తం చేశాడు. ఈ క్రమంలో ప్రకాష్ చేయి తగిలి రమేష్ కిందపడిపోయాడు. దీంతో ఆగ్రహించిన రమేష్ కత్తితో ప్రకాష్‌ను పొడిచేశాడు. బాధితుడిని నెల్లూరులోని ఓ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్సపొందుతూ మరణించాడు. దీనిపై సమాచారం అందుకున్న సైదాపురం ఎస్‌ఐ విజయ్‌కుమార్ ఆస్పత్రికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

అసభ్య మెసేజ్‌కు జరిమానా

తిరుపతి లీగల్ : ఓ యువతిపై ఫేస్‌బుక్‌లో అసభ్యకరంగా మెసేజ్ పోస్ట్ చేసి కించపరిచిన కేసులో తెలంగాణలోని ఖమ్మం జిల్లా కొత్తగూడెం మండలం, కొత్త గొల్లగూడెంకు చెందిన ఎస్.మానస వీణకు రూ.5వేల జరిమానా విధిస్తూ తిరుపతి మూడో అదనపు జూనియర్ సివిల్ జడ్జి సంధ్యారాణి బుధవారం తీర్పునిచ్చారు. వివరాలు.. 2018 మే 11వ తేదీన ఫేస్ బుక్‌లో ఓ వ్యక్తి పేరును బ్లాక్ చేయాలంటూ తిరుపతికి చెందిన ఓ యువతికి మానస వీణ మెసేజ్ పెట్టారు. దానికి యువతి అంగీకరించలేదు. దీంతో మానస వీణ ఆ యువతి ఫేస్‌బుక్ అకౌంట్ ప్రొఫైల్ టైం లైన్ తీసుకొని దానిలో అసభ్యకరంగా మెసేజ్ పెట్టారు. దీనిపై యువతి ఎమ్మార్‌పల్లె పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు ఈ మేరకు మానస వీణపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి ఆమెకు జరిమానా విధించారు.


చరిత్రలో నిలిచేలా అభివృద్ధి

- నిస్వార్థంగా సేవలందిస్తా
- వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి




సమావేశంలో మాట్లాడుతున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి మంగళం : చరిత్రలో నిలిచేలా చంద్రగిరి నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టినట్లు వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. బుధవారం మంగళం, రణధీర్‌పురం, సప్తగిరినగర్‌లో నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయా సచివాలయాల్లో సంక్షేమ బోర్డులను ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ జెండాలను ఎగురువేశారు. అనంతరం మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అడుగుజాడల్లో నడుస్తూ ప్రజాసేవకు అంకితమవుతానన్నారు. జగనన్న అధికారంలోకి వచ్చిన నాలుగన్నరేళ్లలో పేదరిక నిర్మూలనే లక్ష్యంగా పాలన సాగించారని కొనియాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. ముఖ్యమంత్రి సహకారంతో చంద్రగిరిని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దామని వెల్లడించారు. నియోజకవర్గంలోని మారుమూల గ్రామానికి సైతం రహదారి సౌకర్యం కల్పించిన ఘనత ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు మాయమాటలు, ఉత్తుత్తి హామీలతో ప్రజలను మోసం చేశారని విమర్శించారు. మాటకు కట్టుబడి పనిచేసే సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించుకుంటే మరిన్ని సంక్షేమ పథకాలు అందుతాయని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ప్రజలను కుటుంబ సభ్యులుగా భావిస్తారని, అందుకే కష్టసుఖాల్లో తోడుగా ఉంటారని తెలిపారు. కుల మతాలకు అతీతంగా పండుగల సమయంలో కానుకలు అందిస్తున్నట్లు వెల్లడించారు. రూ.25 వేలు విలువ చేసే పెళ్లి కానుకను అందజేస్తున్నట్లు వివరించారు. యువతను క్రీడల్లో ప్రోత్సహించేందుకు క్రికెట్ పోటీలు నిర్వహించామన్నారు. జాబ్ మేళాలు నిర్వహించి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించామని తెలిపారు. కనీస వసతులు కూడా లేని మంగళం, రణధీర్‌పురం, సప్తగిరి పంచాయతీలలోని కాలనీలను అత్యాధునికంగా తీర్చిదిద్దిన ఘనత ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి మాత్రమే దక్కుతుందన్నారు. మంగళం పంచాయతీలో రూ.4.73 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. రూ.28.21 కోట్ల సంక్షేమ నిధులు 6,637 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశామని తెలిపారు. అలాగే రణధీరపురం పంచాయతీలో రూ.7.38 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టగా, రూ.29.74 కోట్ల సంక్షేమ ఫలాలు అందజేసినట్లు వెల్లడించారు. సప్తగిరి నగర్ గ్రామ పంచాయతీలో రూ.8.36 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టగా, రూ.31.15 కోట్ల సంక్షేమ ఫలాలు అందజేశామని వివరించారు. అనంతరం మహిళా సంఘాలకు వైఎస్సార్ ఆసరా చెక్కులు పంపిణీ చేశారు. ఈ క్రమంలోనే యూత్ నాయకుడు నాని ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విడుదల మాధవ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు నారాయణ రెడ్డి, సర్పంచ్‌లు వరలక్ష్మి రాంబాబు, లక్ష్మీనారాయణ, అశోక్‌రెడ్డి, సప్తగిరి నగర్ పంచాయతీ ఇన్‌చార్జి అశోక్‌రెడ్డి, గుండ్రాజు శివశంకర్‌రాజు, ఉప సర్పంచ్‌లు బైరెడ్డిరమేష్, మల్లెమొగ్గల ఉమాపతి, పంచాయతీల అధ్యక్షుడు చిలమంద హరికృష్ణ, రజాక్,, మహ్మద్ ఖాసీం, ఎంపీటీసీ సభ్యులు వరగంటి లక్ష్మయ్య, లక్ష్మీదేవి పాల్గొన్నారు.



వైఎస్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మోహిత్‌రెడ్డి



మోహిత్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న మహిళలు

విలేకరి ఇంట్లో చోరీ



పగులగొట్టిన బీరువా

శ్రీకాళహస్తి: పట్టణంలోని రాజీవ్‌నగర్ వద్ద జర్నలిస్టు కాలనీలో నివసిస్తున్న విలేకరి ఇంట్లో మంగళవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. టూటౌన్ సీఐ రారాజు కథనం మేరకు .. చాన్‌బేగం అనే విలేకరి తన స్నేహితురాలి ఇంట్లో నిద్రిస్తోంది. ఈ సమయంలో చాన్‌బేగం ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలోని బంగారు ఆభరణాలను దుండగులు దోచుకెళ్లారు. బుధవారం ఉదయం ఇంటికి వచ్చిన చాన్‌బేగం చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు ఘటనాస్థలంలో ఆధారాలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

చంద్రగిరి : మండలంలోని నరసింగాపురం రైల్వేస్టేషన్ వద్ద బుధవారం గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. మృతుడి యాచకుడిగా ఆ ప్రాంతంలో తిరిగేవాడని స్థానికులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్సపొందుతూ వలంటీర్ మృతి



రమేష్ కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న రామ్‌ప్రసాద్‌రెడ్డి

విజయపురం : మండలంలోని కలియంబాకం గ్రామానికి చెందిన వలంటీర్ ఎ.రమేష్ (29) బుధవారం మృతి చెందాడు. 3 రోజుల క్రితం తమిళనాడులో జరిగిన రోడ్డు ప్రమాదంలో రమేష్ గాయపడి చికిత్స పొందుతూ మరణించాడు. మంత్రి సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి కలియంబాకం వెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. నేతలు గుణశేఖర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

భవిష్యత్‌లో సైన్స్ కేంద్రంగా 'ఐఐటీ'



మాట్లాడుతున్న రూపమంజరి ఘోష్

ఏర్పేడు : భవిష్యత్‌లో తిరుపతి ఐఐటీ సైన్స్ అభివృద్ధి కేంద్రంగా మారబోతోందని జేఎన్‌యూ న్యూఢిల్లీ మాజీ వీసీ రూపమంజరి ఘోష్ తెలిపారు. బుధవారం మండలంలోని ఐఐటీ తిరుపతి, జంగాలపల్లె వద్ద ఐసర్ ప్రాంగణంలో జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. వివిధ ప్రాంతాల ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి వందలాది మంది విద్యార్థులు హాజరయ్యారు. రసాయనిక, భౌతికశాస్త్ర ప్రయోగాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా రూపమంజరి ఘోష్ మాట్లాడుతూ విద్యార్థులు అత్యాధునిక సాంకేతిక పరిశోధనలపై దృష్టి సారించాలని సూచించారు. అనంతరం క్వాంటమ్ ఫిజిక్స్ పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. శాస్త్రీయ అన్వేషణలోని అద్భుతాలు, ఆకర్షణీయమైన కార్యకలాపాలపై చర్చించారు. కార్యక్రమంలో ఐఐటీ కెమిస్ట్రీ హెచ్‌ఓడీ గౌరీ ప్రసన్నరాయ్, ఫిజిక్స్ హెచ్‌ఓడీ రీతేష్ గంగ్వారీ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి మహేష్ కుమార్ పాల్గొన్నారు.



హాజరైన విద్యార్థినీ విద్యార్థులు

కడుపునొప్పి తాళలేక వ్యక్తి ఆత్మహత్య



హరిప్రసాద్ (ఫైల్)

చంద్రగిరి : కడుపునొప్పి తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని పాతశానంబట్లలో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన హరిప్రసాద్(40) ట్యాక్సీ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో బుధవారం వేకువజామున కడుపునొప్పి తీవ్రం కావడంతో, ఇంట్లో ఉరివేసుకున్నాడు. ఉదయం ఈ విషయాన్ని గుర్తించిన కుటుంబీకులు కన్నీరుమున్నీరయ్యారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.